andhrajyothy.com

ఆంధ్రజ్యోతి



కామారెడ్డి
జిల్లా వార్తలు

5


సోమవారం 29 జూలై 2024

ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 27.4 । కనిష్ఠం 21.5

2న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

కామారెడ్డి టౌన్, జూలై 28: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వచ్చే నెల 2న జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు చేయనున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అనిల్ తెలిపారు. జావిలిన్, 100, 400 మీటర్ల అంశాలలో బాల బాలికలకు, స్త్రీ, పురుషులకు ఉంటాయని తెలిపారు. క్రీడాకారులు అధిక సంఖ్యలో క్రీడా దుస్తుల్లో పాల్గొనాలని తెలిపారు. వచ్చేటప్పుడు వయస్సు ధ్రువీకరణ పత్రం జిరాక్స్‌లతో సమయానికి హాజరుకావాలని తెలిపారు.

అందని సీనరేజ్ నిధులు



మంజీరా ఇసుక తవ్వకాలు చేపడుతున్న దృశ్యం

- స్థానిక సంస్థలకు చేరని రాయల్టీ సొమ్ము
- జిల్లాలో ఇసుక, కంకర, మొరం తవ్వకాలు
- గాంధారి, తాడ్వాయి ప్రాంతాల్లో ఇతర గనుల క్వారీలు
- క్వారీల్లో రూ.కోట్లాదిగా సొమ్ము చేసుకుంటున్న కాంట్రాక్టర్లు
- ప్రభుత్వానికి మాత్రం అంతంత మాత్రమే పన్నుల చెల్లింపు
- బాధిత గ్రామాలకు చేరని సీనరేజ్ నిధులు
- ప్రభుత్వం నుంచి గత ఎనిమిదేళ్లుగా విడుదల కాని రాయల్టీ నిధులు

కామారెడ్డి, జూలై 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్వారీల ద్వారా ప్రభుత్వానికి పన్ను రూపేనా కోట్లాది రూపాయలు చేరుతున్నా బాధిత గ్రామాలకు మాత్రం ప్రభుత్వం నుంచి సీనరేజ్ నిధులు విడుదల కావడం లేదు. గత ఐదేళ్లుగా ప్రభుత్వాలు స్థానిక సంస్థలకు సీనరేజ్ నిధులు విడుదల చేయకపోవడంతో క్వారీల నిర్వహణ సాగే స్థానిక గ్రామాల్లో అభివృద్ధి బాట పట్టడం లేదు. దీంతో ఆయా గ్రామాలు తీవ్రంగా నష్టపోతున్నాయి. పల్లెల్లో పచ్చని గుట్టలు కళ్ల ముందే కరిగి పోతున్నాయి. వాగులు, వంకలు నదులలోని ఇసుక తరలిపోతోంది. ప్రకృతి వైపరీత్యాలకు కారణమవుతున్న కొండల తొలగింపు ప్రభుత్వానికి రాయల్టీ రూపంలో కోట్లాది రూపాయలు తెచ్చిపెడుతుండగా వ్యాపారులకు కాసుల వర్షం కురిపిస్తోంది. గ్రామ పంచాయతీలతో పాటు మండల, జిల్లా పరిషత్‌లకు మాత్రం రాయల్టీ సొమ్ము చేరడం లేదు. దీంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతోంది.

జిల్లాలో ఇసుక, కంకర క్వారీలు

జిల్లా ఇసుక క్వారీలకు ప్రసిద్ధి. బాన్సువాడ, జుక్కల్, ఎల్లారెడ్డి, కామారెడ్డి నియోజకవర్గాల్లోనూ మంజీరా పరివాహక ప్రాంతాల్లో టీఎస్ఎండీసీ ఆధ్వర్యంలో ఇసుక క్వారీలు ఏర్పాటు చేసి తవ్వకాలు చేపట్టాయి. కామారెడ్డి, ఎల్లారెడ్డి ప్రాంతాల్లోను వాగులు, చెరువుల్లోను స్థానిక రెవెన్యూ ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇస్తుంటాయి. జిల్లా పరిధిలోని ప్రధానంగా బీర్కూర్, బిచ్కుంద మండలాల పరిధిలో మంజీరా నదిలో గత ఐదేళ్ల కిందట ఇసుక రీచ్‌లకు సుమారు 24 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను తరలించినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. మరో 31 లక్షల క్యూబిక్ మీటర్లు ఇటీవల తవ్వకాలు చేపట్టారు. ఇవేకాకుండా మాచారెడ్డి, భిక్కనూరు, తాడ్వాయి, ఎల్లారెడ్డి, నిజాంసాగర్, నస్రూల్లాబాద్, మద్నూర్, పిట్లం తదితర మండలాల్లో కంకర, క్వార్ట్, మొరం తవ్వకాలు సైతం ఉన్నాయి. ఈ క్వారీల ద్వారా ఆయా కాంట్రాక్టర్లు అనుమతులు తీసుకుని ప్రభుత్వానికి పన్ను చెల్లిస్తుంటారు.

ఎనిమిదేళ్లుగా విడుదల కాని సీనరేజ్ నిధులు

జిల్లాలోని ఇసుక, కంకర, క్వార్ట్, మొరం క్వారీల ద్వారా ప్రభుత్వానికి కోట్లాది రూపాయలలోనే పన్ను రూపేనా సీనరేజ్ నిధులు వస్తుంటాయి. కానీ ప్రభుత్వం నుంచి గత ఎనిమిదేళ్లుగా సీనరేజ్ నిధులు మాత్రం విడుదల కావడం లేదు. 2015-16లో ఇసుక క్వారీల ద్వారా రూ.6.20 కోట్లు, కంకర, మొరం ఇతర గనుల ద్వారా రూ.12.20లక్షలు ప్రభుత్వానికి సీనరేజ్ రూపేనా నిధులు చేరాయి. 2016-17లో ఇసుక క్వారీల ద్వారా 6.32 కోట్లు, కంకర, మొరం క్వారీల ద్వారా 10.50లక్షలు, 2017-18లో ఇసుక క్వారీల ద్వారా 2.90కోట్లు కంకర, మొరం క్వారీల ద్వారా 11.47 లక్షలు, 2018-19లో ఇసుక క్వారీల ద్వారా 5.20 కోట్లు, కంకర, మొరం క్వారీల ద్వారా 1.60 లక్షలు, 2019-20లో ఇసుక క్వారీల ద్వారా 8.45 కోట్లు, కంకర, మొరం క్వారీల ద్వారా 11.34 లక్షలు, 2020-21లో ఇసుక క్వారీల ద్వారా 8.45కోట్లు, కంకర, మొరం క్వారీల ద్వారా 13.53 లక్షలు, 2021-22లో ఇసుక క్వారీల ద్వారా 14.32 కోట్లు, కంకర, మొరం క్వారీల ద్వారా 16.63 లక్షలు, 2022-23లో ఇసుక క్వారీల ద్వారా 6.12 కోట్లు, కంకర, మొరం క్వారీల ద్వారా 12.23లక్షలు ప్రభుత్వానికి సీనరేజ్ నిధులు చేరినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు.

స్థానిక సంస్థలకు చేరని రాయల్టీ సొమ్ము

జిల్లాలో ఇసుక, కంకర, మొరం ఇతర క్వారీల ద్వారా సీనరేజ్ రూపంలో ప్రభుత్వానికి కోట్లాది రూపాయల నిధులు చేరుతున్నాయి. అయితే ఈ సీనరేజ్ నిధులతో ఆయా క్వారీలు నిర్వహణ జరిగే గ్రామాలకు విడుదల చేసి అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. అయితే స్థానిక సంస్థలకు మాత్రం ఈ నిధులు చేరడం లేదు. దీంతో ఏళ్లుగా రాయల్టీ సొమ్ము కోసం ఎదురు చూపులే మిగులుతున్నాయి. ఖనిజ, ఇతర సహజ వనరులు ఇసుక, కంకర క్వారీలు ఏ ప్రాంతంలో ఉంటాయో వాటి వినియోగం ద్వారా వచ్చే సీనరేజ్ నిధులు ఆ ప్రాంతంలోని స్థానిక సంస్థల అభివృద్ధికి కేటాయించాల్సి ఉంటుంది. ఇందులో ఇసుక ద్వారా క్యూబిక్ మీటర్‌కు రూ.40కంకర క్వారీలో క్యూబిక్ మీటర్‌కు రూ.75 చెల్లించాలి. ఇందులో జడ్పీకి 25శాతం, మండల పరిషత్‌లకు 50శాతం గ్రామ పంచాయతీలకు 25 శాతం నిధులు జమ చేయాలి. ఈ ఆదాయాన్ని గతంలో నేరుగా జడ్పీ ఖాతాలో జమచేసి వారి ద్వారా మండల, గ్రామ పంచాయతీ ఖాతాలకు బదిలీ చేసేవారు. ప్రస్తుతం ప్రభుత్వ ఖాతాకే జమ అవుతున్నాయి. ఇసుక ద్వారా వచ్చే సీనరేజ్ నిధులు 2018 నుంచి రావడం లేదని పలువురు ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. ఈ నిధులు విడుదల చేస్తే ఆయా గ్రామాల అభివృద్ధికి దోహదపడుతుందని స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు చెబుతున్నారు.

30న రెండో విడత రుణమాఫీ

- అర్హులైన రైతుల జాబితాను విడుదల చేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- రెండో విడతలో రూ. 1.50 లక్షల లోపు ఉన్న రైతులు అర్హులు

కామారెడ్డి (ఆంధ్రజ్యోతి) జూలై 28: రెండో విడత రైతు రుణమాఫీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ నెల 30న రెండో విడత రైతు రుణమాఫీ అర్హులైన రైతుల జాబితాను సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో ప్రకటించనున్నారు. అదే రోజు జిల్లాలోని కలెక్టరేట్ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్‌లో బ్యాంక్ అధికారులు, సహకార సంఘాల అధికారులతో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జిల్లా వ్యవసాయశాఖ అధికారి భాగ్యలక్ష్మి సమావేశం కానున్నారు. రెండో విడతలో రూ. 1.50లక్షల లోపు పంట రుణాలు తీసుకున్న రైతుల వివరాలను ప్రభుత్వం ప్రకటించనుంది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు ఏక కాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని ప్రకటించింది. ఇందులో భాంగగా ఆగస్టు 15 కల్లా రూ. 2లక్షల వరకు రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ చేసేందుకు రేవంత్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మూడు విడతల్లో రుణమాఫీ చేయనుంది. ఇప్పటికే రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ చేయడమే కాకుండా ఆయా బ్యాంకుల్లో రైతుల ఖాతాల్లో రుణమాఫీ నిధులను జమ చేసింది. రెండో విడత రుణమాఫీకి చర్యలు చేపట్టింది. ఈ నెల 30న రెండో విడత రుణమాఫీని సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని అసెంబ్లీలో ప్రకటించనున్నారు. రెండో విడత రుణమాఫీపై రైతులు ఎదురు చూస్తున్నారు. మొదటి విడతలో జిల్లాలో 45,295 మంది రైతులకు రుణమాఫీ జరుగగా ఇందుకోసం ప్రభుత్వం రూ. 233 కోట్ల నిధులను విడుదల చేసింది. రెండో విడతలో ఎంత మందికి రుణమాఫీ కానుంది. ఎన్ని నిధులు విడుదల చేయనుంది. ఈ నెల చివరిన తేలనుంది.



పల్లెలపై పట్టింపేది?

- అడ్రస్ లేని స్పెషల్ ఆఫీసర్లు
- బాధ్యతగా కొందరు.. భారంగా ఇంకొందరు
- గ్రామాల వైపు కన్నెత్తి చూడని పలువురు
- పారిశుధ్యం, నీటి సరఫరా అస్తవ్యస్తం
- వ్యాధులు వ్యాపిస్తున్నా చర్యలు శూన్యం

ఎల్లారెడ్డి, జూలై 28: పల్లెల్లో సమస్యలు తాండవిస్తున్నాయి. పంచాయతీ పాలకవర్గాలు లేకపోవడం, ప్రత్యేక అధికారులు పట్టించుకోకపోవడం ఇందుకు కారణాలుగా కనిపిస్తున్నాయి. దీనికి తోడు నిధుల కొరతతో కనీస మరమ్మతులు కూడా చేయించలేని పరిస్థితి ఏర్పడింది. పంచాయతీ ఖాజానాలో నిధుల సమస్య వల్ల చెత్త సేకరించడానికి వినియోగించే ట్రాక్టర్లలో డీజిల్ నింపలేని దుస్థితి పలు చోట్ల నెలకొంది.

పల్లెల వైపు చూడని ప్రత్యేక అధికారులు

కామారెడ్డి జిల్లాలోని 526 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఫిబ్రవరి నుంచి ఈ గ్రామాలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించారు. మండల డివిజన్‌స్థాయి అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించారు. తమ మాతృశాఖలతో పాటు ప్రత్యేక అధికారులుగా పల్లెలను సైతం పర్యవేక్షించాలని ఆదేశించారు. కానీ చాలా మంది ప్రత్యేక అధికారులు పట్టించుకోవడం లేదు. వారానికోసారి కూడా గ్రామాల వైపు కన్నెత్తి చూడటం లేదు. కనీస అవసరాలకు సైతం ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిధుల కొరత కారణంగా గ్రామంలో తప్పనిసరిగా చేపట్టాల్సిన పనులకు పంచాయతీ కార్యదర్శులు సొంతంగా డబ్బులు వేచ్చిస్తున్నట్లు తెలుస్తోంది. ఆరు నెలలుగా ప్రత్యేక అధికారులను నియమించినప్పటికీ వారి ముద్ర కానరావడం లేదు.

సీజనల్ రోగాలకు ఆజ్యం

అపరిశుభ్రత కారణంగా వ్యాధులు విజృంభిస్తున్నాయి. అందుకే వానాకాలం రాగానే పల్లెలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తారు. మురికి కాలువలు ఇళ్ల సమీపాల్లో చెత్తాచెదారం నిల్వ ఉండటంతో దోమలు ప్రబలుతున్నాయి. వర్షపు నీటిని సైతం దారి మళ్లించే ప్రయత్నాలు జరగడం లేదు. గత నాలుగు రోజులుగా ముసురు అలుముకున్న గ్రామాల్లో రక్షణ చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పలు గ్రామాల్లో అడ్డగోలుగా పందుల స్వైర విహారం చేస్తున్నాయి. కనీసం ఈ వర్షాకాలం ప్రత్యేక అధికారులు పర్యవేక్షించేలా జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రభుత్వ ఆసుపత్రిలో పెరిగిన రోగుల సంఖ్య

గ్రామాల్లో రోడ్లు, మురికి కాలువలు, తాగునీటి సమస్య విపరీతంగా ఉండటంతో దానికి తోడు ప్రత్యేక అధికారులు గ్రామాల వైపు కన్నెత్తి చూడటం లేదు. ఒక్కో అధికారికి నాలుగు నుంచి ఐదు గ్రామాలు ప్రత్యేక అధికారి బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన నుంచి ఇప్పటి వరకు గ్రామాల వైపు కొందరు ప్రత్యేక అధికారులు చుట్టపు చూపు లాగా వచ్చి వెళుతున్నారు. దీంతో పల్లెల్లో ఉండే ప్రజలకు పరిశు భ్రత లేకపోవడం వల్ల సీజనల్ వ్యాధులతో బాధపడుతూ ఉన్నారు. ప్రత్యేక అధికారులు గ్రామాల వైపు రావడం లేదని గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇందుకు సంబంధిత అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు కరువు

సీజనల్ వ్యాధుల దృష్ట్యా గ్రామాల్లో మురికి కాలువలు పారిశుధ్య లోపం, తాగునీటి సమస్యతో గ్రామీణ ప్రాంత ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. రోగులు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లడానికి స్థోమత లేకపోవడం స్థానికంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యంపై అవగాహన కల్పించడం కరువైంది. ఒక పక్క ప్రత్యేక అధికారుల నిర్లక్ష్యం, మరో పక్క వైద్య సిబ్బంది, సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించకపోవడం వల్ల గ్రామీణ ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన సదస్సులతో పాటు హెల్త్ క్యాంపులు నిర్వహించాలని కోరుతున్నారు.

10.5 అడుగులకు చేరిన

'పోచారం' నీటిమట్టం

నాగిరెడ్డిపేట, జూలై 28 : పోచారం ప్రాజెక్టు నీటి మట్టం 10.5 అడుగులకు చేరుకుంది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పోచారం ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టు నీటి మట్టం రోజురోజుకు పెరుగుతుండటంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పోచారం ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలతో లింగంపేట, గుండారం వాగుల ద్వారా ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టులో నీటిమట్టం పెరుగుతోంది. ఆదివారం సాయంత్రానికి ప్రాజెక్టులోకి 10.5 అడుగుల నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 1.820 టీఎంసీలకు గాను ప్రస్తుతం 0.552 టీఎంసీల నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టులోకి ఆదివారం 723 క్యూసెకుల ఇన్ ఫ్లో వస్తున్నట్లు ఎల్లారెడ్డి నీటి పారుదల శాఖ డీఈ వెంకటేశ్వర్లు తెలిపారు.



పోచారం ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం

ఘనంగా బోనాల పండుగ



ఎల్లారెడ్డిలో బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు



గోలి లింగాల్‌లో..



మద్నూర్‌లో అమ్మవారి ఆలయం వద్ద భక్తుల సందడి

జిల్లాలో ఆషాఢ మాసం చివరి ఆదివారం కావడంతో గ్రామస్థులు గ్రామ దేవతలకు బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఉదయాన్ని తల స్థానాలు చేసి, నూతన వస్త్రాలను ధరించి బోనాలతో ఊరేగింపుగా బయలుదేరి అమ్మ వార్లకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా సుఖ సంతోషాలతో ఉండాలని, గ్రామాలు పాడి పంటలతో కళకళలాడాలని గ్రామ దేవతలను వేడుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.

నాగిరెడ్డిపేట: మండలంలోని గోలి లింగాల్ గ్రామంలో బోనాల పండుగను ఆదివారం గ్రామస్థులు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రతీ సంవత్సరం గ్రామంలో బోనాల పండుగను గ్రామస్థులు ఆనవాయితీగా నిర్వహిస్తారు. గ్రామంలోని మహిళలు బోనాలను ఎత్తుకుని గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తూ దుర్గమ్మ, పోచమ్మ ఆలయాలకు వెళ్లి అమ్మవారికి బోనాలను సమర్పించుకున్నారు. అనంతరం ఆలయాలలో ప్ర త్యేక పూజలు జరిపి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ మురళి, మాల్తుమ్మెద సొసైటీ ఛైర్మన్ నర్సింలు, శివకుమార్, గ్రామ నాయకులు, ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

దోమకొండ: మండల కేంద్రంలోని దుర్గమ్మకు మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో మహిళలు పెద్దఎత్తున బోనాలను సమర్పించారు. పలుగడ్డ, బురుజు, పనుగట్ల, మసీదు, బీబీపేట రోడ్డు మీదుగా బోనాలను డప్పు, చప్పుళ్లు, డీజే పాటలతో బోనాలను అంగరంగ వైభవంగా ఊరేగించారు. అమ్మవారి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భిక్కనూరు: మండలంలోని సిద్ధరామేశ్వరనగర్, ఇసన్నపల్లి గ్రామాల్లో ఆయా గ్రామాల్లో ఇంటికో బోనం తీసి డప్పుచప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలు, యువకుల నృత్యాల నడుమ ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పెద్ద కొడప్‌గల్: జుక్కల్ గ్రామం నుంచి గ్రామ పొలి మేరలో ఉన్న ఎల్లమ్మ ఆలయం వరకు గౌడ కులస్తులు బోనా లతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం అధ్యక్షులు లక్ష్మణ్‌గౌడ్ మాట్లాడుతు గ్రామస్థులంతా సుఖసంతోషాలతో ఉండాలని, పాడి పంటలు పచ్చగా ఉండాలని అమ్మవారికి మొక్కులు సమర్పించ డం జరిగిందని తెలిపారు.

నాగిరెడ్డిపేట: మండలంలోని గోలి లింగాల్ గ్రామంలో మహిళలు బోనాలను ఎత్తుకుని గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తూ దుర్గమ్మ, పోచమ్మ ఆలయాలకు వెళ్లి అమ్మవారికి బోనాలను సమర్పించుకున్నారు. అనంతరం ఆలయాలలో ప్రత్యేక పూజలు జరిపి మొక్కులు తీర్చుకున్నారు.

బీర్కూర్: మండల కేంద్రంలో ఆదివారం గ్రామ ప్రజలు పస్కు రాజుల పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయాన్నే గ్రామ దేవతలు కొలువు దీరిన చోటుకు చేరుకుని దూప, దీప, నైవేద్యాలను సమర్పించారు. అనంతరం యాటలను బలిచ్చారు. పుష్కలంగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, పాడి పశువులు బాగుండాలని దేవుళ్లను వేడుకున్నారు. గాండ్ల తేలికుల సంఘం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

మద్నూర్: మండల కేంద్రంలోని ఆయా కుల సంఘాల వారు అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. మహిళలు బోనాలతో అమ్మవారికి సమర్పించడానికి డప్పు చప్పుళ్లతో బయలుదేరారు. బోనం కుండకు పసుపు రాసి కుంకుమ, బొట్టి పెట్టి వేపాకులను మాలలుగా చుట్టి తయారు చేశారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ముత్యాల పోచమ్మ ఆలయంలో స్థానికులు అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. బోనాల పండుగకు ముఖ్య అతిథులుగా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ పాల్గొని ముత్యాల పోచమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకల్లో స్థానిక నాయకులు ప్రజలతో కలిసి ఎమ్మెల్యే నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ సత్యనారాయణ, మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా, పట్టణ అధ్యక్షుడు వినోద్‌గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు పద్మ, శ్రీకాంత్, రాము, మాజీ జడ్పీటీసీ ఉషాగౌడ్, ఆలయ కమిటీ సభ్యులు వినోద్, శ్రీనివాస్‌గౌడ్, రాములు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిలో ముత్యాల పోచమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించడానికి వెళుతున్న ఎమ్మెల్యే, ఎంపీ



దోమకొండలో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు



పెద్దకొడప్‌గల్‌లో..

అధ్వానమైన డ్రైనేజీలతో ఇబ్బందులు

● పట్టించుకోని అధికారులు



బీర్కూర్‌లో డ్రైన్ నిర్మాణం కోసం తవ్విన గోతిలో నిలిచిన వర్షం నీరు

బీర్కూర్, జూలై 28 : అధికారుల నిర్లక్ష్య ధోరణి ప్రజల ప్రాణాలకు పెను ముప్పుగా పరిణమించింది. మిషన్ భగీరథ, రోడ్డు భవనాల శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో బీర్కూర్ మండల కేంద్రంలో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. వర్షాల వల్ల రహదారిపై, డ్రైన్‌ల నిర్మాణం కోసం తవ్విన గోతిల్లో వర్షం నీరు నిలుస్తుంది. రహదారి కింద గల మంచినీటి పైపులైన్లలో మురికినీరు చేరి సరఫరా కావడంతో స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బోరుమోటార్ల పైపుల్లో మురికి నీరు సరఫరా అవుతుంది. రహదారి విస్తరణ పనులు ఎందుకు నిలిపివేశారని స్థానిక ప్రజలు ఆర్‌అండ్‌బీ అధికారులను అడుగగా మిషన్ భగీరథ శాఖ అధికారులను అడగాలని, మిషన్ భగీరథ అధికారులకు ఫోన్ చేసి అడిగితే ఆర్ అండ్ బీ అధికారులను అడగండి అని చెప్పి తప్పించుకుంటున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు





బాన్సువాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్సపొందుతున్న రోగులు

● టైఫాయిడ్, చికున్‌గున్యా బారిన పడుతున్న ప్రజలు

● రోగులతో కిక్కిరిసిపోతున్న ఆస్పత్రులు

బాన్సువాడ టౌన్, జూలై 28: వర్షాకాలం అంటేనే వ్యాధుల కాలం. వేసవి తర్వాత వాతావరణంలో సంభవించే మార్పుల కారణంగా వర్షాలు కురియడం, వర్షపు నీరు నిల్వ ఉండడం, ఆ నీటిలో దోమలు ఆవాసాలను ఏర్పాటు చేసుకోవడం, ఇలా వివిధ కారణాల వల్ల ఈ కాలంలో వ్యాధులు ఎక్కువగా వ్యాపిస్తుంటాయి. జగ్రత్తలు పాటించకపోతే ప్రాణానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. వైరస్, బ్యాక్టీరియాలు పెరిగి వైరల్ ఫీవర్, ఇన్‌ఫెక్షన్స్ సోకే ప్రమాదం ఉంది. ఈ సమయంలో రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు త్వరగా వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉంటాయి. వర్షాకాలంలో దోమలు కుట్టడం ద్వారా డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా వంటి వ్యాధులు సోకడంతో ప్రజలు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. బాన్సువాడ మండలంలోని హన్మాజీపేట పీహెచ్‌సీ పరిధిలో గత కొన్ని రోజుల క్రితం అక్కడి ప్రజలు రోగాల బారిన పడి నానా అవస్థలు పడ్డారు. వైద్యులు, ఆరోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు రోగులకు కావాల్సిన మందులు, వైద్యం అందించారు. అదేవిధంగా బోర్లం గ్రామంలో కూడా చికున్‌గున్యా వ్యాధి బారిన పడి మంచానికే పరిమితమయ్యారు.

బాన్సువాడ ఆస్పత్రిలో..

బాన్సువాడ ప్రభుత్వాస్పత్రిలో ఒక్క జూలై నెలలోనే ఇప్పటి వరకు స్త్రీలు 423 మంది, పురుషులు 250 మంది రోగులు సీజనల్ వ్యాధుల బారిన పడి చికిత్స పొందారు. వైద్యులు, సిబ్బంది రోగులకు అవసరమైన చికిత్సలు చేస్తూ మందులు అందిస్తున్నారు. ప్రతీ రోజు 12 నుంచి 15 మంది రోగులు చేరుతున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలుపుతున్నాయి.

వ్యాధులు ప్రబలకుండా వైద్యుల సూచనలు

- పరిసరాలను దోమలు వృద్ధి చెందకుండా శుభ్రంగా ఉంచుకోవాలి.
- దోమతెరలు వాడుకోవాలి.
- బయటి ఆహారం తీసుకోకుండా ఉండాలి.
- అనారోగ్యంతో బాధపడుతున్న వారికి దూరంగా ఉండాలి.
- దగ్గు, జలుబు ఉన్నవారికి దూరంగా ఉండాలి.
- జ్వరం మూడు రోజుల కంటే ఎక్కువగా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

నిధుల లేమి.. నిర్వహణ భారం

● మండల పరిషత్ కార్యాలయ పరిస్థితి



మద్నూర్ ఎంపీడీవో కార్యాలయం

మద్నూర్, జూలై 28 : గత ఐదేళ్లలో నిధుల లేమితో మండల పరిషత్ కార్యాలయ నిర్వహణ భారంగా మారింది. ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాబోయే ఐదేళ్లలో మండల పరిషత్‌లకు నిధులు కేటాయించి ఆదుకుంటారని ఆశా వాహులు ఎదురు చూస్తున్నారు. స్థానిక సంస్థల్లో భాగమైన జిల్లా మండల పరిషత్‌లు నిధులలేమితో సమస్యలను ఎదుర్కొన్నాయి. గడిచిన ఐదేళ్ల కాలంలో వాటికి కేటాయించాల్సిన నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా రద్దు చేశాయి. దీంతో అభివృద్ధికి నోచుకోక పాలన పడకేసింది. గ్రామాల్లో పర్యటించినప్పుడు కళ్లెదుట సమస్యలు కనిపించిన తీర్చడానికి తగినన్ని నిధులు లేక అంతర్ మదనం చెందారు. ప్రతి పనికి ఎమ్మెల్యేలపై ఆధారపడాల్సి వచ్చింది. చాలా మంది ఎందుకు అయ్యామంటూ ఆవేదన వ్యక్తంచేశారు. ఐదేళ్లలో జడ్పీటీసీ, ఎంపీపీలు నిధుల లేమితో తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

నిలిచిపోయిన నిధులు

మండల పరిషత్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వివిధ రకాల నిధులు మంజూరయ్యేవి. వాటితోనే పల్లెల్లో ప్రగతి పనులు చేపట్టేవారు. గతంలో ఒక్కో జడ్పీటీసీకి రూ. కోటి నుంచి 1.5 కోట్ల నిధులు మంజూరయ్యేవి. గత ఐదేళ్లలో అరకొర జనరల్ ఫండ్ మినహాయించి ఇతర నిధులు ఏవి సక్రమంగా రాలేదు. కేంద్రం నుంచి వచ్చే జీఆర్‌జీఎఫ్ నిధులకు 2013లోనే మంగళం పాడారు. ఇక ఆర్థిక సంఘం నిధులు 50.30.20 నిష్పత్తి గ్రామ పంచాయితీలకు కేటాయించేవారు. కాని ఆర్థిక సంఘం నిధుల మొత్తాన్ని గ్రామ పంచాయితీలోకి నేరుగా ఇస్తున్నారు. ఎస్‌ఆర్‌ఈజీఎస్ నిధుల కేటాయింపులో రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్యేలకే పెత్తనం ఇచ్చింది. 2011లో జిల్లా పరిషత్‌లు, మండల పరిషత్ పాలక వర్గాలు లేని సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఒక జీవో తీసుకువచ్చి ఎమ్మెల్యేలకు అధికారం కట్టబెట్టింది. అనంతరం కొత్త ప్రభుత్వాలు కొలువు దీరిన తరువాత జీవోను రద్దు చేయకపోవడంతో ఇప్పటికీ పాత విధానమే కొనసాగుతుంది. నిబంధనల ప్రకారం పనుల తీర్మానాలు చేసి ఇవ్వడమే పనిగా మారింది. ఎంఆర్‌ఆర్ నిధులను కూడా వీరికి ఇవ్వడం లేదు. ఎస్ఎఫ్‌సీ నిధులు మాత్రమే గడిచిన రెండేళ్లలో అరకొరగా అందినట్లు తెలుస్తోంది.

అందరిలోనూ నిరాశే..

గత ఐదేళ్లలో ఒక్కో జడ్పీటీసీకి రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు మించి నిధులు రాలేదని ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నారు. ఇందులో సుమారు రూ.20 లక్షల వరకు ఉపాధిహామీ నిధులే ఉండటం గమనార్హం. 2019లో ఎన్నికైన స్థానిక ప్రజాప్రతినిధుల్లో మెజారిటీ వర్గం అప్పటి అధికార పార్టీలో కొనసాగుతుండటంతో ప్రభుత్వాన్ని విమర్శించే సాహసం చేయలేదు. ఇక ఎంపీటీసీల పరిస్థితి చూస్తే వారికి పదవి ఉంది తప్ప నిధుల ప్రస్తావనే రాలేదు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కిసాన్‌నగర్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

ముప్కాల్, జూలై28: బాల్కొండ మండలంలోని కిసాన్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో 2001-02సంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 23ఏళ్ల తర్వాత విద్యార్థులు, ఉపాధ్యాయులు ఒకేచోట చేరి సందడి చేశారు. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగితెలుసుకున్నారు. ఇంతర ప్రాంతాల్లో వృత్తి, వ్యాపార, ఉద్యోగ రీత్యా 23ఏళ్ళ తర్వాత ఒకే చోట చేరడం ఆనందంగా ఉందన్నారు. తమకు చదువు నేర్పిన పాఠశాలలో తరగతి గదులు తిరిగి చిన్ననాటిజ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యబుద్దులు నేర్పిన గురువులను విశ్వనాథ్‌రెడ్డి, లింబాన్న, తదితర గురువులను శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించేందుకు ముందుకు రావాలి

ఏర్గట్ల, జూలై 28: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ముందుకు రావాలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణచారి కోరారు. కేంద్రప్రభుత్వం చేపట్టిన పోషక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 30 నుంచి తిథి భోజన పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లోని ఎవరిదైనా జన్మదిన వేడుకలు, వివాహవేడుకలు జరుపుకున్నప్పుడు విద్యార్థులకు పండ్లు, స్వీట్స్, ఆరోగ్యకరమైన భోజనం అందించేందుకు ప్రజలు ముందుకు రావాలని కోరారు. ఎవరైనా దాతలు ముందుకు వస్తే తమకు ముందుగా సమాచారం అందించాలన్నారు.

నిర్వాసితులకు ఆర్థిక సహాయం



మెండోరలో బాధితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

మెండోర, జూలై28: మండల కేంద్రానికి చెందిన గోలి అమ్మాయి, దేవాయి, నర్సు నివాసాలు ఇటీవల కురిసిన వర్షాలకు పాక్షికంగా దెబ్బతినడంతో వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున రూ.30వేలు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు గుండోజి రవి వర్షాలకు దెబ్బతిన్న గోలి అమ్మాయి కుటుంబానికి 25కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ విషయాన్ని సునీల్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్ళగా వారికి ఆర్థిక సహాయం అందజేసి ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా సహాయం అందజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు గుండోజి రవి, కొప్పెల మోహన్, దేవరాజ్, మౌలాన,ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

సాబ్‌కా సాత్ సాబ్‌కా వికాస్ అనే నినాదం వట్టి బూటకమే : సీపీఎం

బోధన్‌రూరల్,జూలై28: బోధన్ పట్టణంలో ఆదివారం సీపీఎం కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం సాబ్‌కా సాత్ సాబ్‌కా వికాస్ అనే నినాదం వట్టి బూటకమేనని ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ రుజువు చేస్తుందని నిరూపించారు. కేవలం తన కుర్చీని కాపాడుకోవడానికి కేంద్రం చట్టప్రకారం అన్ని రాష్ట్రాలకు సమానమైన నిధులు కేటాయించడంలో వివక్షతను పాటించిందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర విభజన సందర్భంగా తెలంగాణకు ఇచ్చిన హామీలను అమలు జరుపడంతో గత 10సంవత్సరాలు నిర్లక్ష్యం చేయడంతో పాటు ఇప్పటి బడ్జెట్‌లో కూడా నిధులు కేటాయించకపోవడం కేంద్రం వైఖరికి అద్దం పడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన బడ్జెట్‌లో కేటాయించిన నిధులను సక్రమంగా అమలు జరుపడంతో పాటు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను పించన్‌లకు పెంపుగాని, మహిళలకు ఇస్తానన్న 2500రూపాయల నిధులు కేటాయించకపోవడం సరైంది కాదన్నారు. నిజాంషుగర్స్ ఫ్యాక్టరిని తెరిపిస్తామని ఇచ్చిన హామీని ముందుగా బోధన్ నిజాంషుగర్స్‌ఫ్యాక్టరీని ప్రారంభించాలని ఆయన అన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని సీపీఎం స్వాగతిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్ గౌడ్, ఏశాల గంగాధర్, నన్నేసాబ్, కామ్రేడ్ బాలయ్య, గంగాధర్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై కుంగిన కల్వర్టు

● గుమ్మిర్యాల్‌లో కుంగిన కల్వర్టు ● రాకపోకలకు అంతరాయం ● పట్టించుకోని అధికారులు



గుమ్మిర్యాల్‌లో కుంగిపోయిన కల్వర్టు



అధ్వాన్నంగా మారిన మెట్‌పల్లికి వెళ్లే రోడ్డు

ఏర్గట్ల, జూలై 28: గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని రోడ్లు కల్వర్టులు దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సంబంధిత శాఖ అధికారులు స్పందించక వాహన ,ధారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రం నుంచి జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి వెళ్లే దారిలో రోడ్డు చెడిపోవడంతో రోడ్డుపై మొత్తం నీరు చేరి కొత్తగా వచ్చే ప్రయాణీకులు అగుంతల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇట్టి విషయమై ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవడం లేదని వాహన చోధకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే గుమ్మిర్యాల్ గ్రామంలో పొచ్చెరువుపై ఉన్న కల్వర్టు కుంగిపోయి రెండేళ్లు గడుస్తున్నా నేటికి మరమ్మతులు లేక ప్రయాణీకులకు ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామస్థులు కల్వర్టుపై మట్టిని ఏర్పాటు చేసుకున్నప్పటికీ వర్షానికి కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపో యాయని, పంచాయతీ రాజ్ శాఖ అధికారులకు చెప్పినా స్పందించడం లేదని గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయించి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని కోరుతున్నారు.

కొత్త కల్వర్టు నిర్మాణం చేపట్టాలి

గ్రామంలోని పొచ్చెరవుపైన ఉన్న కల్వర్టు కుంగిపోయి రెండేళ్లవుతుంది. ఇప్పుడు వర్షాలు అధికంగా కురవడంతో పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. ఈ కల్వర్టు మీద నుండే నిర్మల్‌తో పాటు అటు జగిత్యాల జిల్లాకు రాకపో కలు జరుతాయి. ఇట్టి విషయమై అధికారులకు విన్నవించినా పట్టిం చుకోవడం లేదు. పాత కల్వర్టును తొలగించి కొత్త కల్వర్టు నిర్మాణం చేపట్టాలి.



బొల్లి శంకర్, మాజీ ఎంపీటీసీ గుమ్మిర్యాల్

పెద్దమ్మతల్లికి మొక్కులు తీర్చుకున్న భక్తులు



ఆర్మూర్‌లో ఆలయంలో పూజలందుకున్న పెద్దమ్మతల్లి



వనభోజనాలకు గ్రామస్థులు

పెర్కిట్, జూలై28: ఆర్మూర్ పట్టణంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా పెద్దమ్మతల్లికి జంతు బలి ఇచ్చి కోరిక కోర్కెలు తీర్చాలని మొక్కుకున్నారు. ఈ సంవత్సరం భక్తులకు ఏలాంటి ఆటంకాలు కలుగకుండా, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో ఉండాలని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం కమిటీ వారు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం గౌరవ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

● గ్రామాల్లో వనభోజనాల సందడి

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మండలంలోని వివిధ గ్రామాలలో ఆదివారం వనభోజనాల సందడి జరిగింది. గ్రామాల్లోని గ్రామదేవలకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.అనంతరం గ్రామశివా రులో కుటుంబసభ్యులు, బంధుమిత్రులతో కలిసి వనభోజనాలు చేశారు. వర్షాకాలం ప్రారంభమై గ్రామాల్లో గ్రామదేవతలకు జలాభిషేకం చేసి వర్షాలు కురిసి సమృద్ధిగా పంటలు పండాలని మొక్కుకున్నారు. అషాడ మాసంలో చివరి ఆదివారం కావడంతో గ్రామప్రజలు వనభోజనాలకు వెళ్ళారు.

● నల్ల పోచమ్మ ఆలయంలో పోటెత్తిన భక్తులు

ఆర్మూర్ పట్టణంలో నల్లపోచమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. అషాడమాసంలో ఆదివారం కావడంతో మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుయకున్నారు. ఈ సందర్భంగా పలువురు మొక్కులో భాగంగా జంతు బలులు ఇచ్చారు. అదే విధంగా ఆర్మూర్ శివారులోని పెద్దమ్మతల్లి ఆలయంలో ముదిరాజ్ సంఘ సభ్యులు, పట్టణ ప్రజలు పెద్దమ్మ తల్లిని దర్శించుకొని పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సర్వసమాజ్ సభ్యులు, వివిధ కుల సంఘాల సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

నవీపేట:మండలంలోని పలుగ్రామాలలో ఆదివారం వన భోజనాలు నిర్వహించారు.ఆషాడమాసం చివరి ఆదివారం కావడంతో నవీపేటతో పాటు మండలంలోని పలు గ్రామాలలో గ్రామ దేవతలకు పూజలు చేశారు.అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.

సైబర్ నేరగాళ్ల బెదిరింపు కాల్స్

ఆర్మూర్‌టౌన్, జూలై27: మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన అంజలి అనే మహిళకు ఆదివారం సైబర్ నేరగాళ్లు డబ్బులు పంపాలని బెదిరింపు కాల్స్ చేశారని తెలిసింది. అంజలి వాళ్ళ నాన్న బెహరెన్ దేశంలో ఉంటూ మాదక ద్రవ్యలు సరఫరా చేస్తూ పట్టుబడ్డాడని, ఆయనను వదిలివేయాలంటే రూ.10వేల ఫోన్‌పే చేయాలని బెదిరించాడని ఆమె తెలిపింది. దీంతో జరిగిన సంఘటన విషయమై తన తండ్రి పెంటయ్యకు తెలపగా అలాంటి సంఘటన ఏమిలేదని తెలపడంతో సైబర్ నేరగాళ్ళ పని అని భావించారు. ఇలాంటి సంఘటన గతంలో అదే గ్రామానికి చెందిన ప్రవీణ్ అనే వ్యక్తికి జరిగిందని, ముందు జాగ్రత్తగా పోలీసులకు సమాచారం అందించారు.

గ్రామదేవతలకు గంగ నీళ్లతో జలాభిషేకాలు

జక్రాన్‌పల్లి, జూలై28: వర్షాలు కురిసి పంటలు పండాలని కోరుతూ మండలంలోని వివిధ గ్రామాలలో ఆదివారం గ్రామదేతలకు గంగనీళ్ళను వలగొడుగు వేసుకొని ఊరేగింపుగా వచ్చి గ్రామదేవతలకు గంగనీళ్ళతో జలాభిషేకం చేశారు. వివిధ గ్రామాల్లో పోచమ్మ ఆలయంలో గ్రామదేవతలకు ప్రజలకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం వనభోజనాలకు వెళ్ళారు. ఈకార్యక్రమంలో వివిధ గ్రామాల వీడీసీసభ్యులు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మోస్రాలో ఆత్మీయ సమ్మేళనం పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మోస్రా,జూలై28: మండలంలోని మోస్రా జిల్లా పరిషత్ పాఠశాల 2003-04 సంవత్సర విద్యార్థులు ఆదివారం నాడు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యాబుద్దులు నేర్పిన గురువులను ప్రత్యేకంగా ఆహ్వానించి కృతజ్ఞతలు తెలిపారు. అలనాటి జ్ఞాపకాలు గుర్తుకు చేసుకుని ఆనందం వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థి విద్యార్థినిలు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి అందరికి తాను చేస్తున్న ఉద్యోగం కుటుంబ సభ్యులతో పరిచయం చేసుకున్నారు. భోజనం అనంతరం గురువులను సన్మానించి పాదాభివందనం చేశారు.

అపరిచిత కాల్స్ వస్తే పోలీసులకు సమాచారం అందించాలి

భీమ్‌గల్ రూరల్, జూలై28: సైబర్ కాల్స్‌పై ప్రజలు అప్రమత్తంగా వుండాలని, అపరిచిత కాల్స్ వస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని ఎస్సై హరిబాబు తెలిపారు. ఆదివారం భీమ్‌గల్ పోలీస్‌స్టేషన్‌లో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. లోన్‌యాప్స్‌ని నమ్మవద్దని, మీకులోన్ ఇచ్చి మీరు తిరిగి కట్టక పోయిన వేధింపులకు గురిచేస్తారని అన్నారు. మీకు తెలియని వాట్సాప్ నెంబర్ కానీ, ఫేస్‌బుక్‌లో వచ్చే అమెజాన్ గిఫ్ట్ కార్డు వంటి మోసపూరిత కార్డ్‌ని నమ్మవద్దని అన్నారు. కేవైసీ అప్ డేట్ చెయ్యమని కాల్స్ వస్తే నమ్మవద్దని అన్నారు.ఈకార్యక్రమంలో ఏఎస్సై తదితరులు పాల్గొన్నారు.

గంగక్క మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు



కమ్మర్‌పల్లిలో కామ్రేడ్ గంగక్క నివాళులర్పిస్తున్న మాస్‌లైన్ నాయకులు

కమ్మర్‌పల్లి, జూలై 28: కమ్మర్‌పల్లి మండలకేంద్రానికి చెందిన సీపీఐ (ఎంఎల్)మాస్‌లైన్ సీనియర్ కార్యకర్త కామ్రేడ్ బేల్దారి గంగక్క మొదటివర్ధంతిని ఆదివారం ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా మాస్‌లైన్ ప్రజాపంథ జిల్లా నాయకులు సారసురేష్ మాట్లాడుతూ..గంగక్క మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ఈలోటును ఎవరు పూడ్చలేనిదన్నారు. పార్టీకి ప్రజా ఉద్యమాలలో పాల్గొన్న ఘటనలను గుర్తు చేశారు.ఈకార్యక్రమంలో మాస్‌లైన్ మండల కార్యదర్శి అశోక్, సత్తెక్క, లక్ష్మీ, బాజన్న, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మోకాన్‌పల్లిలో విద్యార్థి అదృశ్యం



అశోక్(ఫైల్)

నవీపేట,జూలై28: మండలంలోని మోకన్‌పల్లి పంచాయతీ పరిధిలోని అంజుమాన్‌ఫారంకు చెందిన కోడూరి అశోక్ అనే 15సంత్సరాల విద్యార్థి అదృశ్యమయ్యాడని ఎస్‌ఐ యాదగిరిగౌడ్ తెలిపారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో పదోతరగతి చదువుతున్న అశోక్ ఈ నెల 27న పాఠశాలకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదని అన్నారు. అశోక్‌తండ్రి తిరుపతి ఉపాధి నిమిత్తం గతంలో దుబాయ్ వెళ్లగా తల్లి జయ కూలీ పని చేస్తూ తన ఇద్దరు కుమారులను చదివిస్తుందని అన్నారు.గత సంవత్సరం తల్లి జయ హైదరాబాద్‌లో కూలీ పని చేయగా అశోక్ కాచిగూడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి వరకు చదివాడని, ఇటీవల వారి కుటుంబం స్వగ్రామమైన అంజుమాన్‌ఫారంకు రావడంతో 10వ తరగతి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో చేర్పించడం జరిగిందని అన్నారు. తనకు ఇక్కడ చదవడం ఇష్టం లేదని తరుచుగా తన స్నేహితులకు చెప్పేవాడని శనివారం తన స్కూల్ బ్యాగును తోటి విద్యార్థులకు ఇచ్చి ఇంటి వెళ్ళలేదని అన్నారు. ఆదివారం రోజున తల్లి జయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తాం : మాజీ ఎమ్మెల్యే



ఎత్తొండ క్యాంప్‌లో ఇళ్లను పరిశీలిస్తున్న దృశ్యం

కోటగిరి,జూలై28: మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్‌నాయకులు ఏనుగు రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. కోటగిరి మండలంలోని ఎత్తొండ క్యాంప్‌లో ఆదివారం కూలిపోయిన, పాత ఇళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో బీఆర్ఎస్ నాయకులు నిరుపేదలకు ఇళ్లు ఇవ్వకుండా తమ కార్యకర్తలకే ఇళ్లు ఇచ్చారని ఆరోపించారు. అర్హులైన లబ్దిదారులు ఇళ్లు లేక వర్షానికి తడుస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి విండో అధ్యక్షులు సునీల్‌కుమార్ చౌదరి,కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

10కె రన్‌లో మెడల్ సాధించిన వేల్పూర్‌వాసి



గుగ్గిలం అశోక్

వేల్పూర్, జూలై28: వేల్పూర్ మండల కేంద్రానికి చెందిన గుగ్గిలం అశోక 10కెరన్‌లో మెడల్ సాధించారు.రన్‌ఫర్‌రన్ అంబాసిటర్‌గా అశోక్ ఎంపికయ్యారు.ఈసందర్భంగా జరి గిన 10కె రన్‌లో మంచి ప్రతిభ కనబ రిచి అ శోక్ మెడల్ సాధించారు.ఈసందర్భంగా మెదక్ ఎంపీ రఘునందన్‌రావు చేతుల మీదుగా గుగ్గిలం అశోక్ మెడల్ అందుకున్నారు.మెడల్ సాధించిన వేల్పూర్ ప్రజాప్రతిని ధులు, స్నే హితులు,హర్షం వ్యక్తం చేస్తూమరె న్నోవిజ యా లు సాధిస్తూ వేల్పూర్‌గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని అన్నారు.

చికిత్స పొందుతూ హోంగార్డు మృతి



ముత్తెన్న (ఫైల్)

ముప్కాల్, జూలై28: వేల్పూర్ పోలీస్‌స్టేషన్ లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న మెట్టు ముత్తెన్న(50) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. ముప్కాల్ మండలం కొత్తపల్లికి చెందిన ముత్తెన్న కుటుంబం ఆర్మూర్‌లో నివాసముంటుం ది.ఈనెల 8న ముత్తెన్నకు బీపీ పెరిగి మెదడులో నరాలు చిట్లిపోవడంతో నిజామాబాద్ ప్రైవేటు ఆసుపత్రిలో ఆపరేషన జరిగింది.అప్పటికే దాదాపు రూ.12లక్షల వరకు ఖర్చు కాగా ఆర్థిక భారంతో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. ఆదివారం ఉదయం మరణించారు.మృతునికి భార్యఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

ఘనంగా తీజ్ ఉత్సవాలు

బోధన్‌రూరల్,జూలై28: బోధన్ మండలంలోని రాజీవ్‌నగర్ తండాలో ఆదివారం తీజ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈతీజ్ ఉత్సవంలో మహిళలు, పిల్లలు పెద్ద మొత్తంలో, గ్రామస్థులు, తండావాసులు సీఐ తదతరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఘనంగా బోనాల పండుగ



ఆచన్‌పల్లిలో బోనం ఎత్తిన మున్సిపల్ చైర్‌పర్సన్



బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఏనుగు రవీందర్ రెడ్డి



మెండోరాలో మొక్కులు చెల్లించుకుంటున్న గ్రామస్థులు



బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

బోధన్‌రూరల్,జూలై28: ఆషాఢ మాసం చివరి ఆదివారం కావడంతో పట్టణంతో పాటు బోధన్, సాలూర మండలాల్లోని గ్రామాలలో బోనాల పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు తమ ఇంటి నుండి బోనాలు తీసుకుని గ్రామ దేవతల ఆలయాలకు డప్పువాయిద్యాల మధ్య చేరుకున్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఒడిబియ్యం నింపి చీర, సారెలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సకాలంలో వర్షాలు కురువాలని, పాడిపంటలు సమృద్దిగా పండాలని, ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు ఉన్నారు.

వర్ని: వర్ని మండలం శ్రీనగర్ గ్రామంలో ఆదివారం బోనాలు, తీజ్ పండుగ ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. అఫందీఫారం, వకీల్ ఫారం, వివిధ గిరిజన తండాల ప్రజలు ఉత్సవాల్లో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డితో కలిసి సంబరాలు నిర్వహించారు. మేక వీర్రాజు, దశాగౌడ్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

వర్ని మండలంలో ఆదివారం వివిధ గ్రామాల్లో బోనాల పండుగ ఉత్సవాలు వైభవంగా జరిగాయి. వర్నిలోని వడ్డేపల్లి, జాకోర, పాత వర్ని, జలాల్‌పూర్ తదితర గ్రామాల్లో బోనాల ఉత్సవాలు జరిగాయి. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి, డీసీసీ డెలిగేట్ యలమంచిలి శ్రీనివాస్ రావులు పాల్గొన్నారు.

వర్ని: చందూర్ మండల కేంద్రంలో ఆదివారం బోనాల పండుగ ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంలో మహిళలు పెద్ద సంఖ్యలో బోనాల ఊరేగింపు నిర్వహించి గ్రామ దేవతలకు సమర్పించారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

భీమ్‌గల్‌రూరల్: భీమ్‌గల్ మండలంలోని మెండోరా, పల్లికొండ, బాబాపూర్, పిప్రి, బడాభీమ్‌గల్, గోన్ గొప్పుల, తదితర గ్రామాలలో ఆదివారం బోనాల పండుగ నిర్వహించారు. ఆషాడ మాసం ఆదివారం పురష్కరించుకొని గ్రామం నలువైపులా ఉన్న గ్రామదేవతలకు బోనాలు సమర్పించారు. నైవేద్యాలు సమర్పించారు. పాడి పంటలు బాగుండాలని, అంటువ్యాధులు ప్రబలకుండా ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గ్రామ ప్రజలు కుటుంబ సమేతంగా వనభోజనాలలో పాల్గొన్నారు.

రుద్రూరు: తెలంగాణ ప్రజలు సంస్కృతిని ప్రతిబింబిస్తూ జరుపుకునే ప్రధాన పండుగలో బోనాల పండుగ ప్రత్యేకమైంది. ఆదివారం రుద్రూరు మండల కేంద్రంలో నిర్వహించిన బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, బాన్సువాడ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డిలు హాజరై బోనం ఎత్తుకుని భజాభజంత్రీలతో ప్రధాన వీధుల గుండా ర్యాలీగా వెళ్లి గ్రామ దేవతలకు బోనాలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు.ఈకార్యక్రమాలలో బోధన్ మాజీ మున్సి పల్ చైర్మన్ సునీతా దేశాయ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వీఆర్ దేశా య్, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

కోటగిరి: కోటగిరి మండలంలోని ఎత్తొండ గ్రామంలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. బోనాల పండుగకు కాంగ్రెస్ నాయకులు ఏనుగు రవీందర్ రెడ్డి ముఖ్య అతిథి హజరయ్యారు. గ్రామస్థులతో కలిసి బోనాలు ఎత్తుకుని గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు సుభిక్షంగా పండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విండో అధ్యక్షులు సునీల్‌కుమార్ చౌదరి, కాంగ్రెస్ నాయకులు అరుణ్ కుమార్, భీమా సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్:బాల్కొండ మండల కేంద్రంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో ఆదివారం ఘనంగా బోనాల సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంపరదాయ దుస్తులు ధరించి గ్రామంలోని ప్రధాన వీదులగుండా సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించి పోతరాజు విన్యాసాలు స్థానికులను ఆకట్టుకున్నాయి. పాఠశాల నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం బాల్కొండలోని ఐదు పోచమ్మ దేవతలకు పలు రకాల నైవేద్యాలను సమర్పించారు. విద్యార్థులు పాఠశాల నుంచి బోనాలు ప్రధాన వీదుల గుండా తిరుగుతూ పోతరాజుల విన్యాసాలు చేస్తూ స్థానికులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందంతో పాటు పాఠశాల డైరెక్టర్‌లు కోటగిరి భానుచందర్,ప్రిన్సిపాల్ విజయ్‌కర్తన్ పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో ఆదివారం పోచమ్మ బోనాలు ఊరేగింపు నిర్వహించారు. ప్రతి యేటా ప్రతి ఆషాడ మాసంలోలో ఈ పండగా నిర్వహించడం ఆనవాయితిగా వస్తుందని గ్రామ ప్రతినిదులు పేర్కొన్నారు. భక్తులు పోచమ్మ బోనాలతో పాటు పలు నైవేధ్యాలు, అమ్మవారికి సమర్పించారు. బోనాల పండగ సందర్భంగా గ్రామంలో పండగ వాతవరణం ఉట్టిపడింది. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు కాపాడాలని అమ్మవారిని మొక్కుకున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు బ్రహ్మానందం, నాయుడు ఆంజనేయులు, నాగర్జున, మధు, సురేశ్, గోపి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ పోస్టర్ల ఆవిష్కరణ


చలో ఢిల్లీ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

పెద్ద కొడప్‌గల్, జూలై 28 : ఆగస్టు 9న ఢిల్లీలో నిర్వహించే చలో మాదిగల పోస్టర్లను ఆదివారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు రవీందర్ కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు రవీందర్ మాట్లాడుతూ గత ఎన్నికల హామీలలో ఇచ్చిన మాట ప్రకారం బీజేపీ నాయకులు ఎస్సీ వర్గీకరణ కోసం ఇచ్చిన మాట నెరవేర్చాలని కోరుతూ ఢిల్లీలో మాదిగల మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించతలపెట్టినట్లు తెలిపారు. ధర్నా కార్యక్రమానికి మాదిగ బిడ్డలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మాదిగ నాయకులు పాల్గొన్నారు.

సౌదీఅరేబియాలో ఆర్గొండ వాసి మృతి

రాజంపేట, జూలై 28: రాజంపేట మండలం ఆర్గొండకు చెందిన కోర్పల్ శామయ్య మృతిచెందాడు. ఈనెల 5న సౌదికి వెళ్లిన శామయ్య రెండు రోజుల తర్వాత ఆరోగ్యం బాగలేక అక్కడే ఆసుపత్రిలో చేరాడు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. గ్రామానికి చెందిన శామయ్య కుటుంబసభ్యులకు తెలుపడంతో శోకసంద్రంలో మునిగిపోయారు. జీడబ్ల్యుఏసీ గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక సంస్థ సభ్యుడు మహ్మద్ ఫరూక్ మృతుని కంపెనీ వాళ్ళ, ఇండియన్ ఎంబీసీతో మాట్లాడి మృతదేహాన్ని ఆదివారం స్వగ్రామానికి చేరవేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

వసతి గృహాలపై ప్రభుత్వం చిన్నచూపు

కామారెడ్డిటౌన్, జూలై 28 : వసతి గృహాలపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని ఏబీవీపీ జిల్లా హాస్టల్ కన్వీనర్ ఖలీల్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టల్‌లలో వసతులు లేక మెనూప్రకారం భోజనం అందక విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. రాష్ట్రప్రభుత్వం పేరుకు మాత్రమే సన్నబియ్యం అందిస్తున్నామని చెబుతూ హాస్టల్‌లలో పాలిష్ చేసిన బియ్యాన్ని అందిస్తుందని ఆరోపించారు. కనీసం ప్రహరీ, సరైన వస్తువులు, రూమ్స్ లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. హాస్టల్ వార్డెన్‌లు సైతం సమయపాలన పాటించడం లేదని, ఇష్టమైన సమయానికి వస్తున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వసతి గృహాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు పర్యవేక్షించి విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

చీకోటి ప్రవీణ్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

కామారెడ్డిటౌన్, జూలై 28 : చీకోటి ప్రవీణ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు నునావత్ గణేష్‌నాయక్ డిమాండ్ చేశారు. పులే అంబేద్కర్ వారసుడైన దళిత బహుజన మేధావి బడుగుబలహీన వర్గాల కోసం అనునిత్యం పోరాడుతున్న హైకోర్టు అడ్వకేట్ కదిరి కృష్ణపై పెట్టిన పోలీసు కేసును వాపస్ తీసుకోవాలన్నారు. బెదిరింపులకు పాల్పడుతున్న చీకోటి ప్రవీణ్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేస్తామని ప్రకటించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

రాజంపేట, జూలై 28 : మండలంలోని ఎల్లారెడ్డి నియోజకవర్గానికి చెందిన ఆర్గొండ, ఎల్లారెడ్డిపల్లి, గుండారం గ్రామాలకు చెందిన లబ్దిదారులకు ఆదివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రణీత్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు సల్మాన్, జిల్లా ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు వినోద్, మండల ఉపాధ్యక్షుడు బన్సీలాల్, జనరల్ సెక్రెటరీ సంతోష్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు శశికాంత్‌రెడ్డి, గణేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ ఉత్సవాలు

సదాశివనగర్, జూలై 28 : మండలంలోని వజ్జెపల్లి, యాచారం బంజార తండాలలో ఆదివారం ఘనంగా తీజ్ ఉత్సవాలు నిర్వహించారు. యువతులు తమకు మంచి వరుడు కావాలని దైవాన్ని కోరుతూ భక్తి శ్రద్ధలతో ఈ పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. గిరిజన యువతులు 9 రోజులు అత్యంత నిష్టగా ఉపవాసాలు ఉండి ఆకుకూరలు, సజ్జల రొట్టెలతో ఒకే పూట ఆహారం తీసుకుంటూ పూజలు చేస్తారు. కార్యక్రమంలో తండా నాయకులు లచ్చిరాంనాయక్, సంతోష్‌నాయక్, సర్ధార్‌నాయక్, సురేందర్ నాయక్, లచ్చిరాం, భాభ్యనాయక్, గంగారాం నాయక్, శంకర్ నాయక్, బలిరామ్ నాయక్ యువతి, యువకులు పాల్గొన్నారు.

ఎస్ఐని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు


ఎస్ఐని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెద్ద కొడప్‌గల్, జూలై 28 : పెద్దకొడప్‌గల్ నూతన ఎస్ఐగా నియమితులైన మహేందర్‌ను ఆదివారం మండల కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. గతంలో ఇక్కడ పనిచేసిన కోనారెడ్డి కామారెడ్డి జిల్లా కేంద్రానికి బదిలీ కాగా, ఆయన స్థానంలో మహేందర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి మాట్లాడుతు కొత్త ఎస్ఐ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేయాలని కోరారు. అంతకుముందు నూతన ఎస్ఐని మండల ఎమ్మార్పీఎస్ నాయకులు శాలువాపూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు శ్యామప్ప, నాగిరెడ్డి, కల్లూరి పండరి, సంతోష్, ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు రవీందర్, నాయకులు మహిపాల్, బల్‌రాం, విఠల్, వీరయ్య, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు సౌత్‌క్యాంపస్‌లో ప్లేస్‌మెంట్ డ్రైవ్

భిక్కనూరు, జూలై 28 : మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో మంగళవారం క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, క్యాంపస్ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ పాత నాగరాజు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్‌లోని త్రిపుల్ ఐటీ గచ్చిబౌలి ప్రాంగణంలోని కైనోస్ జియో స్పెషల్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్‌లో జీఐఎస్ అనలిస్ట్ ఉద్యోగాల కోసం ఈ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన జియోఇన్ఫర్మెటిక్ పూర్తి చేసిన, ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్లు డాక్టర్ ప్రతిజ్ఞ, డాక్టర్ నారాయణ పాల్గొన్నారు.

గృహిణి ఆత్మహత్య

మద్నూర్, జూలై 28 : మద్నూర్ మండలం పెద్దతడ్గూర్ గ్రామంలో శనివారం రాత్రి చంద్రకళ (25) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకు న్న ట్లు ఇంచార్జి ఎస్సై సాయిలు తెలిపారు. అనారోగ్యం కారణంగా ఉరి వేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. మృతురాలికి భర్త, ఒక పాప, ఒక బాబు ఉన్నారు. తండ్రి విఠల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు. శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మద్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వెల్లడించారు.

కనుమరుగవుతున్న నిజాంసాగర్ గార్డెన్


ప్రాజెక్టు వద్ద గల గోల్‌బంగ్లా

- లక్షలు వెచ్చించినా.. ఫలితం శూన్యం
- నిరాశలో పర్యాటకులు
- కళ తప్పిన గుల్‌గస్త్ గార్డెన్, గోల్‌బంగ్లా
- వెలుగని ఐమ్యాక్స్ లైట్లు
- మూత్రశాలలు, మరుగుదొడ్లు అధ్వానం
- అధికారులు స్పందించాలని కోరుతున్న పర్యాటకులు

నిజాంసాగర్, జూలై 28 : ఉభయ జిల్లాల పర్యాటక స్థలమైన నిజాంసాగర్ గార్డెన్ కనుమరుగవుతుంది. ఆనాడు పర్యాటకులకు కనువిందు చేసే గార్డెన్లు, ప్రాచీన కట్టడాలు కనుమరుగవుతున్నాయి. అధికారులు, పాలకులు మారుతున్నా పర్యాటక స్థలాన్ని తీర్చిదిద్దాలనే ఆలోచన లేకుండా పోవడం గమనార్హం. ఉభయ జిల్లాల పర్యాటకులతో పాటు మహా రాష్ట్ర, కర్నాటక, పొరుగు జిల్లాలు హైదరాబాద్, సంగారెడ్డి, తదితర జిల్లాల నుంచి పర్యాటకులు నిజాంసాగర్‌కు వస్తుంటారు. నిజాంసాగర్‌లో నీటిని ఆస్వాదించి కేరింతలు వేస్తుంటారు. కాగా ఈ యేడాది వర్షాకాలంలో ప్రాజెక్టులోకి ఎలాంటి వరదనీరు రాకపోవడంతో నిరాశగానే మిగులుతోంది. ప్రాచీన కట్టడాలు పర్యాటకులకు వెక్కిరిస్తూనే ఉన్నాయి. నైజాం కాలం నాటి గార్డెన్లలో ఏర్పాటు చేసిన నీళ్ల విరజిమ్మే ఫౌంటెన్లు కళాహీనంగా మారాయి. 2004లో రాజీవ్ పల్లెబాట కార్యక్రమం అనంతరం దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి నిజాంసాగర్ పర్యాటక స్థలాలకు పూర్వ వైభవం తెస్తానని హామీ ఇచ్చారు. 2008లో అతిథిగృహాలు, గోల్‌బంగ్లా, గుల్‌గస్త్‌కు నిధులు మంజూరు చేశారు. వీటితో పాటు వివిపీ బంగ్లాలను తూతూ మంత్రంగా మరమ్మతులు జరిపి చేతులు దులుపుకున్నారు. 2001లో అప్పటి సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నిజాంసాగర్ సందర్శనకు వస్తారనే నేపథ్యంలో నీటిపారుదల శాఖాధికారులు దాదాపు 3 కోట్ల రూపాయల వ్యయంతో రహదారులు, అతిథి గృహాలు, గార్డెన్లు ఆకట్టుకునే విధంగా ఆదరా బాదరగా పనులు చేసి చేతులు దులుపుకున్నారు. లక్షల రూపాయలు ఖర్చు చేసినా నిజాంసాగర్ గార్డెన్లు, వివిపీ అతిథి గృహాలు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. 2021లో అతిథి గృహాల్లో అన్ని సౌకర్యాలు కల్పించినా, అవి మున్నాళ్లకే ముచ్చటగా మిగిలిపోయాయి. నిజాంసాగర్ నుంచి సంగారెడ్డి జిల్లా మాసాన్‌పల్లి ఎక్స్ రోడ్, గుల్‌గస్త్, సుల్తాన్‌నగర్ నుంచి గుల్‌గస్త్ వరకు రహదారులు వేసినా మున్నాళ్లకే అధ్వానస్థితికి చేరాయి. వీవీపీ అతిథి గృహాల్లో విద్యుద్దీకరణ, ఫర్నిచర్‌లు అంతంత మాత్రంగానే ఉన్నాయి. వీవీపీ గార్డెన్‌లో అప్పట్లో ఉన్న పచ్చదనం ప్రస్తుతం లేకుండా పోయింది. తెలంగాణ ప్రభుత్వం 40 మంది సిబ్బందిని నియమించినప్పటికీ గార్డెన్‌లు సక్రమంగా నిర్వహణ లేకపోయింది. గార్డెన్‌లలో అప్పట్లో ఉన్న భారీవృక్షాలను సైతం నీటి పారుదల శాఖాధికారులు వాటిని నరికివేశారు. గార్డెన్లలో ఉన్న ఐమ్యాక్స్ లైటు మున్నాళ్లకే అవి పాడైపోవడంతో వెలుగులు లేకుండాపోయాయి. అధికారులు, పాలకులు ససేమిరా అనడం పట్ల సర్వత్రా అసంతృప్తి వ్యక్తం అవుతుంది. 12, 16, 20 వరద గేట్లపైన వర్షాకాలం వెలిగేందుకు మూడేళ్ల క్రితం స్వప్న కన్‌స్ట్రక్షన్ సంస్థ మెర్క్యూరీ లైట్లను ఏర్పాటు చేసినా మున్నాళ్లకే పాడయ్యాయి. కొత్త వాటిని బిగించాలనే ఆలోచన లేకపో వడం గమనార్హం. నిజాంసాగర్ 48 గేట్లకు వర్షాకాలం చేపట్టే ఆయిలింగ్ గ్రీసింగ్ పనులు ఈ యేడాది చేపట్టలేకపోయారు. 12 ,16 వరదగేట్లలోని గేట్లు మొరాయించిన విషయం విదితమే. వీటికి మరమ్మతులు చేపట్టకుండా అధికారులు బ్లాకిచేశారు. ప్రాజెక్టులోనికి ఎగువ ప్రాంతం నుంచి భారీ వరద నీరు వస్తే వరదగేట్లను ఎత్తేందుకు నానా తంటాలు పడతారు. ప్రాచీన కట్టడాలు, గార్డెన్లు, వరద గేట్లను బాగు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


గుల్‌గస్త్ బంగ్లా


పనిచేయని ఫౌంటేన్లు


నవాబ్ అలీ విగ్రహం వద్ద గార్డెన్

మహిళల పట్ల లైన్‌మెన్‌ల దురుసు ప్రవర్తన

కామారెడ్డిటౌన్, జూలై 28 : కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ డబుల్‌బెడ్ రూమ్‌ల వద్ద మహిళల పట్ల ఇద్దరు లైన్‌మెన్‌లు దురుసుగా ప్రవర్తించడంతో వారిని పోలీసులకు అప్పగించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం డబుల్ బెడ్‌రూమ్‌ల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్‌వైర్ కాలిపోవడంతో స్థానికులు లైన్‌మెన్ గఫూర్‌కు సమాచారం అందించారు. గఫూర్‌తో పాటు మరో లైన్‌మెన్ రాజేందర్ అక్కడి చేరుకుని ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ వేసి మరమ్మతులు చేశారు. అనంతరం స్ట్రీట్‌లైట్‌లు రావడం లేదంటూ లైన్‌మెన్‌ల దృష్టికి తీసుకెళ్లడంతో మద్యం మత్తులో ఉన్న ఇద్దరు లైన్‌మెన్‌లు మహిళల పట్ల అసభ్యపదజాలంతో దురుసుగా ప్రవర్తించడంతో ఇరువురిని ఘెరావ్ చేసి పోలీసులకు అప్పగించారు. లైన్‌మెన్‌ల తీరుపై ఉన్నతాధికారులు దృష్టిసారించాలని స్థానికులు కోరారు.


లైన్‌మెన్‌లను ఘెరావ్ చేస్తున్న మహిళలు

బురదలో కూరుకుపోయిన వాహనాలు

బీర్కూర్, జూలై 28 : మండల కేంద్రంలో ప్రధాన రహదారి విస్తరణ పనులు కొన్ని రోజులుగా కొనసాగు తున్నాయి. ఇటీవల ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురిశాయి. దీంతో రహదారి పూర్తిగా బురదమయంగా మారింది. రహదారిపై వెళ్లే వాహనాలు ఎక్కడికక్కడ బురదలో కూరుకుపోయాయి. గత్యంతరం లేక వాహన దారులు ఇదే రహదారిపై రాకపోకలు సాగిస్తున్నారు. ఆదివారం రహదారిపై లారీలు బురదలో ఇరుక్కు పోవడంతో బోధన్ నుంచి బీర్కూర్‌కు వచ్చే బస్సులు ఊరి చివరన నిలిపి వేసి ప్రయాణీకులను దింపేసి వెనుతిరిగి వెళ్లారు. దీంతో ప్రయాణీకులు బస్సు దిగి వ్యయ ప్రయాసలకోర్చి కిలోమీటర్ దూరం నడుచుకుంటూ బీర్కూర్‌కు చేరుకున్నారు. బీర్కూర్‌కు వచ్చిన బస్సులు రూట్ మార్చుకుని తిమ్మాపూర్, నసురులాబాద్ మీదుగా బోధన్‌కు వెళ్లాయి. రహదారి విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకో వాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


బీర్కూర్‌లో ప్రధాన రహదారిపై బురదలో వాహనాలు కూరుకుపోయిన దృశ్యం

అధ్వానంగా మురికి కాలువలు


జనగామలో అధ్వానంగా ఉన్న మురికికాలువ

సదాశివనగర్, జూలై 28 : గ్రామాలలో మురుగుకాలువలు అధ్వానంగా ఉన్నాయి. కాలువలు ఇలా ఉంటే రోగాలు రాకుండా ఎలా ఉంటాయని గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని జనగాంలో మిషన్‌భగీరథ పైప్‌లైన్‌ల కోసం మంచిగా ఉన్న మురుగు కాలువలను ధ్వంసం చేస్తూ పైప్‌లైన్‌లు ఏర్పాటు చేసి డ్రైనేజీ నిర్మాణం మర్చిపోయారు. నివాసాల మధ్య మురుగుపేరుకుపోయి దోమలకు నిలయంగా మారడంతో గ్రామంలో అనేకమంది ప్రజలు జ్వరాల భారిన పడి అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇదే మురుగుకాలువ నుంచి తాగునీటి పైప్‌లైన్‌లో వెళ్లాయి. దీంతో మిషన్ భగీరథ నీటిని ముట్టుకోవాలంటేనే భయపడుతున్నారు. మూడుసంవత్సరాలుగా డ్రైనేజీ నిర్మాణం చేపట్టకపోవడం మురుగునీరు తొలగిపోవడంతో దోమలు వ్యాప్తిచెంది అనేక రోగాలకు నిలయాలుగా మారుతున్నాయి. ఇప్పటికైనా ప్రత్యేక అధికారులు కాని మండల అధికారులు స్పందించి మురుగు కాలువలు సక్రమంగా చేస్తే ప్రజలకు మేలు జరుగుతుందని కోరుతున్నారు.

రేకుల షెడ్డు దహనం

బీర్కూర్, జూలై 28 : మండలంలోని వీరాపూర్‌లో అజ్మత్ అనే వ్యక్తి ఇంట్లో విద్యుదాఘాతం సంభవించి ఇంట్లో వస్తువులన్నీ కాలిబూడి దయ్యాయి. వీరాపూర్‌కు చెందిన అజ్మత్ అనే వ్యక్తి కూరగాయల వ్యాపారం చేస్తుంటాడు. ఇదిలా ఉండగా ఆదివారం అజ్మత్ భార్య ఆసుపత్రికి వెళ్లగా అజ్మత్ ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లాడు. విద్యుదాఘాతంతో రేకులషెడ్డు దహనం అయింది. ఇంట్లో ఉన్న బట్టలు, వస్తువులు వంట సరుకులు అన్ని కాలి బూడిదయ్యాయని బాధితుడు తెలిపాడు. సుమారు 50 వేల ఆస్తినష్టం వాటిల్లిందని అజ్మత్ తెలిపాడు.


విద్యుదాఘాతంతో కాలిపోయిన వస్తువులు

బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకుల అందజేత

భిక్కనూరు, జూలై 28 : మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన మెట్టు ప్రవీణ్‌కుమార్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి భిక్కనూరు సీఐ సంపత్ కుమార్, ఎస్సై సాయికుమార్ మూడునెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా సిద్ధరామేశ్వర ట్రస్ట్ ప్రతినిధులు మెజిషియన్ సంతోష్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబమైన మృతుడు ప్రవీణ్ కుటుంబానికి భిక్కనూరు సీఐ, ఎస్సై నిత్యావసర సరుకులను అందజేయ్యడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. భిక్కనూరు పోలీసులు ఎంతో ఆదర్శప్రాయులని వారు కొనియాడారు. కార్యక్రమంలో సిద్ధరామేశ్వర ట్రస్ట్ ప్రతిని ధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


మృతుడి కుటుంబానికి నిత్యవసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

కామారెడ్డి జిల్లాలో 12.4 మి.మి వర్షపాతం నమోదు

- నిజాంసాగర్, పోచారం ప్రాజెక్ట్‌లకు స్వల్పంగా వస్తున్న వరద

కామారెడ్డి, జూలై 28 (ఆంధ్రజ్యోతి):కామారెడ్డి జిల్లాలో మోస్తార్ వర్షాలు కురుస్తున్నాయి. గత పదిరోజులుగా ముసురుతో కూడిన వర్షాలు పడుతునే ఉన్నాయి. ఆదివారం సైతం ఎడ తెరపిలేని వర్షం పడింది. గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 12.4 మి.మిల వర్షం కురిసింది. అత్యధికంగా భిక్కనూరు మండలంలో 24.4 మి.మి వర్షపాతం నమోదైంది. జిల్లాలో గత పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు చెరు వులు, వాగుల్లోకి వరద వచ్చి చేరుతుంది. నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి స్వల్పంగా వరద వస్తుంది. ప్రాజెక్ట్‌లోకి 610 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. నిజాంసాగర్ ప్రాజెక్ట్ పూర్తిస్థాయి సామర్థ్యం 17.802 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.800 టీఎంసీలో మాత్రమే నీరు నిల్వ ఉంది. పోచారం ప్రాజెక్ట్‌లోకి సైతం 681 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. ఈ ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1.820 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.462 టీఎంసీలు మాత్రమే నీరు నిల్వ ఉంది.


నిజాంసాగర్ ప్రాజెక్ట్

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
శాంతి	ఓసీ
దర్శన్	డెడ్‌పూల్
ప్రియా 70	కల్కి
ప్రియా 35	రాయన్

బాన్సువాడ	
మహేశ్వరి	రాయన్
వెంకటేశ్వర	పురుషోత్తముడు

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	170	220	230

